# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 28-04-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

❖ డీప్ టెక్నాలజీ, ఏఐ, క్వాంటం లాంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశ భవిష్యత్‌ను మారుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

❖ రైల్వే బడ్జెట్‌లో రాష్ట్రానికి 10 వేల 134 కోట్ల రూపాయల నిధులను కేటాయించామని కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

❖ రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకురావడం ద్వారా యువతకు ఉపాధి కల్పిస్తామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు.

❖ రానున్న మూడు నెలల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులను ఆదేశించారు.

====================

ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ విశాఖపట్టణంలో ఏర్పాటు కావడంతో ఉత్తరాంధ్ర జిల్లాలు ఉపాధి కేంద్రాలుగా మారుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. గూగుల్ డేటా సెంటర్ విశాఖకే కాదు.. రాష్ట్రానికే దిక్సూచిగా నిలుస్తుందని చెప్పారు. విశాఖ జిల్లా ఆనందపురం మండలంలోని తర్లువాడలో గూగుల్ డేటా సెంటర్ కి ముఖ్యమంత్రి భూమిపూజను ఈరోజు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్ర చరిత్రలో కొత్త సాంకేతికతకు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. 2028 సెప్టెంబర్ నాటికి ఈ డేటా సెంటర్ ని పూర్తి చేసి ప్రారంభించాలని నిర్వాహకులకు కోరారు. డీప్ టెక్నాలజీ, ఏఐ, క్వాంటం టెక్నాలజీలు దేశ భవిష్యత్‌ను మారుస్తాయని చంద్రబాబు నాయుడు పేర్కొంటూ...

(వాయిస్ 31 సెకన్లు)

====================

విశాఖపట్టణం కేంద్రంగా ఏర్పాటు అవుతున్న దక్షిణ కోస్తా రైల్వే జోన్ పరిధిలోకి మరికొన్ని సెక్షన్లు కలుపుతూ పాలనా పరమైన మార్పులు చేయాలని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజ్ఞప్తి చేశారు.

విశాఖలోని వీఎంఆర్డీఏ కార్యాలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సౌత్ కోస్టల్ రైల్వే జోన్ కార్యాలయాన్ని చంద్రబాబు నాయుడు, కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈరోజు సందర్శించారు. ఈ సందర్భంగా కొత్త జోన్ కార్యకలాపాలు, రాష్ట్రంలో రైల్వే ప్రాజెక్టుల పురోగతిపై కేంద్రమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు దక్షిణ మధ్య, తూర్పు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. దక్షిణ కోస్తా రైల్వే జోన్ సహా రాష్ట్రంలోని రైల్వే ప్రాజెక్టులపైన పురోగతిపైన అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ముఖ్యమంత్రి ఈ సమీక్షలో మాట్లాడుతూ... రాష్ట్ర పరిధిలోకి వచ్చే అరకు - కొత్తవలస సెక్షన్ లను కొత్త జోన్‌లో కలపడం ద్వారా ఆయా ప్రాంతాల అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు.

====================

రాష్ట్రానికి 10 వేల 134 కోట్ల రూపాయల నిధులను రైల్వే బడ్జెట్ లో కేటాయించామని రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. విశాఖపట్టణంలో ఈ రోజు జరిగిన గూగుల్ డేటా సెంటర్ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ... దేశంలోనే తొలిసారిగా నవ నిర్మాణ్ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో 74 స్టేషన్లను ఆధునీకరిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 16 వందే భారత్ సర్వీసులు, 22 అమృత్ భారత్ సర్వీసులు నడుస్తున్నాయని తెలిపారు. 2026 జూన్ 1 తేదీన సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ను అధికారికంగా నోటిపై చేయబోతున్నామని కేంద్రమంత్రి ప్రకటించారు. అదే విధంగా అమరావతి నుంచి హైదరాబాద్ కు బులెట్ ట్రిన్ ప్రాజెక్టు కూడా త్వరలోనే ప్రారంభమవుతుందని అశ్వినీ వైష్ణవ్ తెలియజేశారు.

(వాయిస్ 30 సెకన్లు)

====================

రానున్న మూడు నెలల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే పీఎం సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ అధికారులను ఆదేశించారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి, నెడ్ క్యాప్ వీసీఎండీ కమలాకర్ బాబు, పీఎం సూర్యఘర్ కాంట్రాక్టర్లు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో వంద రోజులలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించే 6 లక్షల పీఎం సూర్యఘర్ కనెక్షన్లను పూర్తి చేయాలని కోరారు. ప్రతి డిస్కం పరిధిలో రోజుకు కనీసం 2 వేల పీఎం సూర్యఘర్ కనెక్షన్లు పూర్తి చేసే విధంగా అధికారులు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు.

====================

విశాఖ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సింహాచలంలోని శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి వారిని ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు, కేంద్ర ఐటీ శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఈరోజు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభం వద్ద సంప్రదాయం ప్రకారం మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రి వెంట కేంద్ర మంత్రులు కె. రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, వంగలపూడి అనిత, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, గంటా శ్రీనివాసరావు, పి. గణబాబు తదితరులు పాల్గొన్నారు.

విరామం

====================

రానున్న పదేళ్ల కాలంలో విశాఖ నగరం ఐటీ హబ్‌గా మారుతుందని రాష్ట్ర ఐటీ, విద్యా శాఖా మంత్రి నారా లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. గూగుల్ సంస్థ ఆధ్వర్యంలో విశాఖలో ఏఐ శక్తి కాన్‌క్లేవ్ ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఐటీ అభివృద్ధిలో హైదరాబాద్ కంటే మేటిగా విశాఖను మారుస్తామని స్పష్టం చేశారు. విశాఖలో ఐటీ, ఏఐకి సంబంధించి పూర్తి ఎకో సిస్టమ్ తయారు

చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు తేవడమే కాదు.. వాటి నిర్వహణ కూడా కీలకమని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలను తెచ్చి యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని లోకేశ్ వెల్లడిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

పశ్చిమ గోదావరి జిల్లాలో డీజిల్ సరఫరా సజావుగా సాగుతోందని కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. భీమవరం పట్టణంలోని విస్సాకోడేరు వంతెన వద్ద స్థానిక హెచ్.పి. పెట్రోల్ బంక్‌లను కలెక్టర్ ఈ రోజు ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ వివరాలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. డీజిల్ వినియోగదారులతో మాట్లాడి సరఫరా పరిస్థితులపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... కొంతమంది రైతులు ముందస్తు జాగ్రత్తతో అధిక పరిమాణంలో డీజిల్ నిల్వ చేసుకోవడం వల్ల కృత్రిమ కొరత పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. అవసరానికి మించి డీజిల్ కొనుగోలు చేయవద్దని కలెక్టర్ సూచించారు.

====================

పశ్చిమ గోదావరి జిల్లాలో గత 15 విడతల రెవెన్యూ క్లినిక్‌ల ద్వారా 310 దరఖాస్తులను పరిష్కరించినట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి చెప్పారు. భీమవరంలో రెవెన్యూ క్లినిక్స్ ప్రగతిని అధికారులతో ఈరోజు సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ క్లినిక్‌లు జిల్లాలో మంచి ఫలితాలు ఇస్తున్నాయని కలెక్టర్ అన్నారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ కార్యక్రమంతో పాటు సమాంతరంగా రెవెన్యూ క్లినిక్‌లను నిర్వహిస్తున్నామని చెప్పారు.

====================

తిరుపతి జిల్లా తిరుచానూరులోని శ్రీ వేంకటేశ్వర నిత్యాన్న ప్రసాద వితరణ కేంద్రాన్ని టిటిడి ఈవో ఎం. రవిచంద్ర ఈ రోజు పరిశీలించారు. ఈ సందర్భంగా అన్నప్రసాద వితరణ విధానంపైన భక్తులతో నేరుగా ఆయన మాట్లాడారు. అన్నప్రసాదాల నాణ్యత, సమయపాలన, సేవల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం అన్నప్రసాద భవనంలోని స్టోర్ రూమ్, కోల్డ్ స్టోరేజ్, వంటగది, పరిశుభ్రతను ఆయన తనిఖీ చేశారు.

====================

జిల్లాలో ఐపిఎల్ క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న ముఠాను అదుపులోకి తీసుకున్నామని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఈరోజు నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... చీరాల సబ్ డివిజన్ పరిధిలోని ఈపురుపాలెం, తోటవారిపాలెంలో క్రికెట్ పోటీలపై పందేలు నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు 12 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. అలాగే వేటపాలెంలో సెల్ ఫోన్ ల ద్వారా క్రికెట్ బెట్టింగులు నిర్వహిస్తున్న మరో 15 మందిని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.

====================

====================